Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# పర్యావరణహిత వ్యవసాయం

ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను అదుపు చేయాలంటే పర్యావరణ వ్యవసాయం మేలని ఇటీవల వెలువడిన ఫ్రాన్స్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందం పరిశోధనలో తేలింది. సురక్షిత ఆహార విధానాల కోసం డిమాండ్ పెరుగుతున్న ప్రస్తుత సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అన్వేషించక వ్యవసాయరంగానికి మరో మార్గం కనిపించడం లేదు. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను పర్యావరణ వ్యవసాయం యూరప్‌లో 47 శాతం తగ్గించగలదని ఈ అధ్యయనంలో తేలింది. ఫలితంగా భూతాపం రెండు డిగ్రీల కంటే తక్కువ నమోదయ్యే అవకాశాలున్నాయని అధ్యయనం తేల్చిచెప్పింది. పర్యావరణ వ్యవసాయం వల్ల యేటా యూరోపియన్ దేశాల్లో ఎరువుల వినియోగం 3.8 లక్షల టన్నుల మేరకు తగ్గుతుందని భావిస్తున్నారు. వాతావరణ ఉపశమనం కోసం చేసిన మరెన్నో అధ్యయనాలు కూడా వ్యవసాయంపై అలముకుంటున్న తీవ్రతపై ఇంకా ఎక్కువ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్యవసాయ భూముల విస్తీర్ణాన్ని పెంచినప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పుండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాగా, వ్యవసాయ ఉత్పత్తులపై వాణిజ్యం నిర్వహించే 17 సంస్థలు నూతన ఆవిష్కరణలను వ్యతిరేకించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వ్యవసాయం కోసం అడవుల్ని నరకడం, నివాసిత ప్రాంతాలుగా మార్చడం వల్ల 47 నుంచి 51 శాతం వాయు ఉద్గారాల శాతం ఉటుందని తెలుస్తోంది. ఇదే ఉష్ణోగ్రతల మార్పులో ప్రధానపాత్ర పోషిస్తోంది. పర్యావరణ వ్యవసాయం అంటే పర్యావరణంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా వ్యవసాయ విధానాన్ని కూడా మార్పు చేసుకోవడం! అంటే భూతాపం నుంచి బయటపడాలంటే తీసుకునే చర్యల్లో వ్యవసాయ విధానంలో మార్పులు కూడా కీలకపాత్ర పోషిస్తాయన్న మాట.

స్నేహపూర్వక వాతావరణ కల్పనలో వ్యవసాయం కూడా కీలక భూమిక పోషిస్తుందని పరిశోధనలు తెలుపుతున్నాయి. వ్యవసాయపరంగా హితకారకమైన వాతావరణం కల్పించడం మనందరి కర్తవ్యం. అంటే వ్యవసాయానికి అనువైన వాతావరణాన్ని కల్పించాల్సి ఉంటుందన్న మాట. యూరప్‌ను పదేళ్ల వరకు భూతాపం తగ్గించే చర్యల్లో భాగంగా పర్యావరణ వ్యవసాయం చేపట్ట వచ్చునని ఇంగ్లండ్‌కు చెందిన భూసార కేంద్రం తెలియజేసింది. కాకపోతే సహజసిద్ధమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన, ఆరోగ్యకరమైన పద్ధతులను ప్రోత్సహించవలసి ఉన్నది. ఉద్గారాల ప్రభావం వల్ల చైనా, భారత్ తదితర దేశాల్లో తీవ్రంగా ప్రభావితమై ఉష్ణోగ్రతలు పెరిగేందుకు అవకాశం కల్పిస్తున్నాయని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఒక్క ఐరోపా ఖండంలోనే గాకుండా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్గారాల విడుదల ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీలకు పెరిగే ప్రమాదం పొంచివున్న నేపథ్యంలో అన్ని దేశాలు ముందస్తు చర్యలు చేపట్టవలసి ఉన్నది. ఇందులో ప్రధానంగా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల విడుదలను అరికట్టడంలో పర్యావరణానికి మేలు కలిగించే వ్యవసాయ పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎందుకంటే ఉష్ణోగ్రతలు పెరిగితే దాని ప్రభావం ఏ ఒక్క దేశంతోనూ ఆగదు. అన్నిదేశాలపై ఒకేరకమైన ప్రభావాన్ని చూపుతాయి. మినహాయింపులు లేని విధానాలను అనుసరించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది.

గత కొద్ది సంవత్సరాలుగా వ్యవసాయ జీవావరణపై ఆసక్తి పెరుగుతుండడం అభినందించవలసిన పరిణామమే! భూగ్రహానికి ఒనగూడుతున్న నష్ట నివారణ చర్యల్లో ఇదెంతో కీలకభూమికి పోషిస్తుందనడంలో సందేహం లేదు. మనదేశంలో తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంజిల్లా పునుకుల గ్రామంలో 15 ఏళ్లగా రసాయనిక పురుగుమందుల వాడకాన్ని పూర్తిగా నిలిపివేశారు. దీని వల్ల పురుగుమందుల నివారణ మేనేజ్‌మెంట్ ఏర్పాటుకు దారితీసింది. ఈ పద్ధతిలో 3.6 మిలియన్ ఎకరాల భూమిలో పురుగుమందుల వినియోగం లేని వ్యవసాయం కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తరువాత కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడం అభినందనీయం. ఈ ప్రయోగం ఉత్పాదకంపై ప్రభావం చూపకపోవడం గమనార్హం. అంటే ప్రకృతి వ్యవసాయం వల్ల భూసారంలో మార్పులు ఏర్పడి, భూతాప నివారణ చర్యలకు కూడా దోహదపడుతుందని చెప్పుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రోత్సాహంతో కొనసాగుతున్న ఈ జీరోబడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌పై ఏడాది క్రితం అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనంలో వరి, వంకాయల ఉత్పతులు 11, 71 శాతానికి పెరిగాయని తేలింది. అయితే, దక్షిణ భారతదేశంలో గోధుమల పంట లేనందువల్ల గోధుమలపై ఈ విధానం ఏ మేరకు ఉంటుందో వెల్లడికాలేదు. అయితే, ఈ విధానాన్ని చేపట్టిన రైతులు అవసరమైన ఉత్పత్తులు సాధించగలరని ఆశించడంలో సందేహం అక్కర్లేదని ప్రస్తుత పరిస్థితులు, ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. పంజాబ్ కూడా పురుగు మందులు వినియోగించని గోధుమ పంటనుంచి వచ్చే గోధుమ పిండిని వినియోగిస్తోంది. సేంద్రీయ వ్యవసాయంపై ఇప్పటి వరకు దృష్టి పెట్టిన దాఖలాలు కనిపించడం లేదుకానీ, ఆంధ్రప్రదేశ్ ఈ విధానం వల్ల సాధిస్తున్న ఫలితాలను గమనించి త్వరలోనే పంజాబ్ కూడా ఈ విధానాన్ని అనుసరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటు భూతాపం వల్లగానీ, పెరుగుతున్న వాయు ఉద్గారాలను నివారించే దిశలోగానీ ఆలోచిస్తే ప్రపంచంలోని పలు దేశాలు కూడా ఈ సేంద్రీయ వ్యవసాయంపై దృష్టిపెట్టక తప్పనిసరి పరిస్థితులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.